ధూల్‌పేట్‌లో ఘనంగా బోనాలు



ఉత్సవాల్లో ఆల పురుషోత్తమ్ రావు తదితరులు

అబిడ్స్: ధూల్‌పేట్‌లోని జలక్షత్రీయ సమాజ్ వారు బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. గురువారం అమ్మవారికి బోనాల ఉత్సవాలు చేపట్టారు. ఈ సందర్భంగా గోషామహల్ నియోజకవర్గం బీజేపీ నాయకుడు ఆల పురుషోత్తమ్‌రావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ నెల రోజుల పాటు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో జరిగిన బోనాల వేడుకలకు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు వేగవంతంగా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ఆలయాల పరిసరాల్లో వీధిదీపాల ఏర్పాటు, తాగునీటి వసతులు, రోడ్ల మరమ్మతులు వెంటనే పూర్తి చేయాలన్నారు. ఈ వేడుకల్లో కార్పొరేటర్లు లాల్‌సింగ్, దర్శన్‌తో పాటు ఉదయ్ సింగ్, శేఖర్, మోతిసింగ్ పాల్గొన్నారు.

తాగునీటి, మురుగునీటి సమస్యను పరిష్కరించాలి



అశోక్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న చంద్రశేఖర్

చాంద్రాయణగుట్ట: లలితాబాగ్ డివిజన్‌లోని తాగునీటి, మురుగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని బీజేపీ సీనియర్ నాయకుడు మాదరి చంద్రశేఖర్ అన్నారు. గురువారం హెచ్‌ఎండబ్ల్యూఎస్ఎస్ మేనేజింగ్ డైరెక్టర్ అశోక్‌రెడ్డిని చంద్రశేఖర్ కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ..తానాజీనగర్, భయ్యాలాల్‌నగర్, కాళికానగర్, మారుతీనగర్, లలితాబాగ్, మల్లికార్జునస్వామి నగర్, రాఘవేంద్రనగర్ బస్తీల్లో తాగునీటి, మురుగునీటి పైపులైన్ సమస్య తీవ్రంగా ఉందన్నారు. దీనిపై వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని చంద్రశేఖర్ తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అరెస్ట్

అబిడ్స్: గంజాయి విక్రయాలు సాగిస్తున్న ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని పోలీసులు అరెస్టుచేశారు. మల్లేపల్లి మంగారు బస్తీలో నివాసముంటున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మహమ్మద్ నదీమ్ (26)కి అర్జున్ రెడ్డి అనే వ్యక్తి తో స్నేహం ఏర్పడింది. స్నేహం కాస్త గంజాయి అమ్మకాల వరకు వెళ్లింది. అర్జున్ రెడ్డి తీసుకు వచ్చిన గంజాయిని లాంగ్ డ్రైవ్ యాప్ ద్వారా బుక్ చేసుకుని నారాయణగూడ ప్రాంతంలో అమ్మకాలు చేపడుతుండగా పోలీసులు పట్టుకున్నారు. నిందితుడివద్ద నుంచి 500 గ్రాముల గంజాయిని కారును స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ ఎస్టీఎఫ్ డీటీం సీఐ నాగరాజు నదీమ్ ను అరెస్ట్ చేసి నారాయణగూడ ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించారు. అర్జున్ రెడ్డి పై కేసు నమోదు చేశారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేద్దాం

బండ్లగూడ: దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేద్దామని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రెసిడెంట్ యాదగిరి అన్నారు. ఈ నెల 9న జరిగే దేశవ్యాప్త సమ్మెలో మున్సిపల్ కార్మికులు పాల్గొంటున్నట్లు గురువారం బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్రకు సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శతాబ్ద కాలంగా కార్మికవర్గం అనేక త్యాగాలు, పోరాటాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలలోని 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా తీసుకొచ్చి వాటి అమలుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తుందన్నారు. కార్మికుల హక్కుల పోరాటం కోసం ఈ నెల 9న సమ్మె చేపడుతున్నామన్నారు. ఇందులో కార్మికులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సురేష్, సుభాష్, నరేందర్, రామాంజనేయులు, జగన్, నవీన్, శ్రీధర్, టౌఫిక్, వెంకటేష్, కృష్ణ పాల్గొన్నారు.

బోనాల ఉత్సవాలకు పకడ్బందీ చర్యలు

అదనపు బలగాలతో బందోబస్తు

- ఇప్పటికే ఉత్సవాల నిర్వాహకులతో ఇంటరాక్షన్
- భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు
- 'సాక్షి'ప్రత్యేక ఇంటర్వ్యూలో దక్షిణ, తూర్పు మండలం డీసీపీ చైతన్య కుమార్



చార్మినార్: నగర పోలీసు కమిషనరేట్ పరిధి దక్షిణ, తూర్పు మండలం పరిధిలోని పాతబస్తీలో బోనాల ఉత్సవాలకు ముందు జాగ్రత్త చర్యలకు శ్రీకారం చుట్టారు. శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా భక్తులకు ఎప్పటికప్పుడు తగిన సలహాలు, సూచనలు చేస్తూ బోనాల పండుగ జరిగేటట్లు చర్యలు తీసుకుంటున్నారు. ఈనెల 20న బోనల పండుగ, 21న తొట్టెల, ఘటాల సామూహిక ఊరేగింపు కోసం అవసరమైన మేరకు అదనపు బలగాలతో పోలీసులు బందోబస్తు కొనసాగించనున్నారు. అంతేకాకుండా వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు అవసరమైన మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. దక్షిణ మండలంలోని లాల్‌దర్వాజ నుంచి చార్మినార్ ద్వారా నయాపూల్ వరకు అమ్మవారి ఘటాల సామూహిక పరిసమాప్తి ఊరేగింపు ఉన్నట్లే శ్రద్ధాబాద్‌లో కూడా సైదాబాద్ చౌరస్తా నుంచి ఎర్రకుంట వరకు సామూహిక ఊరేగింపు ఉంటుందని.. ఇందుకోసం అవసరమైన ఏర్పాట్లన్నీ చేస్తున్నామని దక్షిణ, తూర్పు మండలం డీసీపీ చైతన్య కుమార్ గురువారం 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు.

◆ **మీ జోన్ పరిధిలో ఎన్ని పోలీసు స్టేషన్లున్నాయి?**
10

◆ **ఎంత మంది ఏసీపీలున్నారు ?**
చాంద్రాయణగుట్ట, సంతోష్‌నగర్, సైదాబాద్, మలక్‌పేట్‌తో కలిసి నలుగురు ఏసీపీలున్నారు.

◆ **బోనాల బందోబస్తు ఎలా ఉంది?**
బోనాల బందోబస్తు పకడ్బందీగా కొనసాగుతోంది. 20, 21 తేదీల్లో అదనపు బలగాలతో బందోబస్తు నిర్వహించనున్నాం.

◆ **మొత్తం ఎంత మంది బందోబస్తులో పాల్గొంటున్నారు?**
జోన్ పరిధిలో ఉన్న 600 మంది సిబ్బందితో పాటు 10 ప్లాటూన్ల అదనపు పోలీసు సిబ్బందితో బందోబస్తు కొనసాగుతుంది.

◆ **మహిళా భక్తులకు సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?**
పాతబస్తీలో రెండు రోజుల పాటు కొనసాగనున్న బోనాల ఉత్సవాలను సంబంధిత పోలీసు ఉన్నతాధికారులు ఆయా ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ద్వారా పరిస్థితులను ఎప్పటికప్పుడు అందచనా వేసి తగిన ఆదేశాలు జారీ చేస్తారు.

◆ **ఆలయాల వద్ద ఒకేసారి బోనాలు సమర్పించే సమయంలో మహిళా భక్తులకు ఇబ్బందులు కలిగే అవకాశాలున్నాయి.. దీనిపై ఎలాంటి చర్యలు తీసుకోనున్నారు.?**
ఆలయాల వద్ద మహిళా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా మహిళా కానిస్టేబుళ్లతో బందోబస్తును ఏర్పాటు చేయనున్నాం.

◆ **ఉత్సవాల నిర్వాహకులకు మీరిచ్చే సలహాలు, సూచనలున్నాయా?**
విధినిర్వహణలోని పోలీసులతో ఉత్సవాల నిర్వాహకులు పూర్తిగా సహకరించాలి. ఏదైనా శాంతి భద్రతల సమస్యలు తలెత్తితే వెంటనే మా దృష్టికి తీసుకురావాలి.

◆ **మరిన్ని వివరాలు..ఏవైనా..**
పాతబస్తీలోని ప్రధాన ఆలయాలతో పాటు అన్ని ప్రాంతాల్లోని అమ్మవారికి స్థానిక భక్తులు భక్తిశ్రద్ధలతో బోనాలను సమర్పించనున్నందున ఇప్పటికే అవసరమైన బందోబస్తును రంగంలోకి దింపి శాంతి భద్రతలను పర్యవేక్షిస్తున్నాం.

వైద్యులకు సన్మానం



వైద్యులను సత్కరిస్తున్న ఐఎంఏ ప్రతినిధులు

సుల్తాన్‌బజార్: వైద్యం ప్రజల ప్రాణాలను రక్షించే దేవుళ్లుగా కొలుస్తారనిదదే రీతిలో వైద్యులు పనిచేయాలని డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ రవీందర్ నాయక్ అన్నారు. గురువా రం కోఠిలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హైదరాబాద్ బ్రాంచ్ ఆధ్వర్యంలో వైద్యుల దినోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వైద్యులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు దిలీప్ భాను శాలి అధ్యక్షత వహించారు. అనంతరం డీహెచ్ రవీంద్రనాయక్ మాట్లాడుతూ..వైద్యులకు సమాజంలో ఎంతో గౌరవం ఉన్నది అని ఆయన అన్నారు. ఇటీవ ల కొందరు వైద్యుల వల్ల కొంత నష్టం జరుగుతుందని వాటిని సవరించాల్సిన అవసరం ఉందన్నారు. స్వామి బుద్ధమయ నంద, రాష్ట్ర అధ్యక్షుడు ద్వారకనాథరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ అశోక్, తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సిటీ బ్రాంచ్ అధ్యక్షుడు డాక్టర్, శ్రీరంగ్ అంగరీ, కోశాధికారి డాక్టర్ పల్లం ప్రవీణ్, కార్యదర్శి మినహాజ్, సుల్తాన్‌బజార్ ఇన్‌స్పెక్టర్ నరసింహ పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలీయమైన పార్టీ



వీహెచ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అఫ్సర్ యూసుఫ్‌జాహీ

గోల్కొండ: కాంగ్రెస్ బలీయమైన పార్టీ అని మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హనుమంతరావు అన్నారు. కాంగ్రెస్ సేవా దళ్ రాష్ట్ర ఇన్‌చార్జిగా నియమితులైన సందర్భంగా టీపీసీసీ ఉపాధ్యక్షుడు అఫ్సర్ యూసుఫ్‌జాహీ గురువారం ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్‌లో అనుబంధ సంస్థలకు ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. యువజన కాంగ్రెస్‌తో పాటు మహిళా విభాగం కాంగ్రెస్, సేవా దళ్ తదితర అనుబంధ సంస్థల్లో యువకులు సమర్థవంతంగా పనిచేస్తూ మంచి నాయకులుగా ఎదుగుతున్నారన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో బలంగా ఉందన్నారు.

క్రీడాకారుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి



ఐస్ స్కేటింగ్ క్రీడాకారులను అభినందిస్తున్న శివసేనారెడ్డి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలు, క్రీడాకారుల అభ్యున్నతికి కృషి చేస్తుందని తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కె.శివసేనారెడ్డి తెలిపారు. గురువారం ఎల్బీ స్టేడియంలో 20వ జాతీయ షార్ట్‌ట్రాక్ ఐస్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో గెలుపొందిని తెలంగాణ రాష్ట్ర క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో త్వరలో అమలు కాబోయే క్రీడా పాలసీ నూతన అధ్యాయానికి నాంది పలుకుతుందన్నారు. ఐస్‌స్కేటింగ్ పోటీల్లో వివిధ విభాగాల్లో పతకాలను సాధించి తెలంగాణ రాష్ట్రాన్ని రెండవ స్థానంలో నిలబెట్టడంపై హర్షం వ్యక్తం చేశారు. అనంతరం బంగారు పతకాలు సాధించిన నయనశ్రీ, సన్షితారెడ్డి, వెండి పతకాలు సాధించిన ప్రణవ్ మహదేవ్‌లను అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర శక్తి సూపర్ షీ కో ఆర్డినేటర్ కె.విద్యరెడ్డి, కోచ్‌లు అబ్దుల్ ఖాదీర్, సయ్యద్ అమీర్‌అలీ, సయ్యద్ ఆషాన్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పుగూడలో జలమండలి అధికారుల పర్యటన



చాంద్రాయణగుట్ట: ఉప్పుగూడ డివిజన్‌లోని క్రాంతినగర్, కృష్ణారెడ్డి నగర్‌లోని బస్తీలు, గల్లీల్లో తాగునీటి నూతన పైపులైన్ కోసం గురువారం జలమండలి జహనుమా సబ్ డివిజన్-8 మేనేజర్ ప్రభాకర్, మేనేజర్ సత్యనారాయణ బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షులు జాలిగం చిరంజీవితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ..బస్తీల్లో తాగునీటి, సీవరేజ్ పైపులైన్ వ్యవస్థ అంతంత మాత్రంగానే ఉందన్నారు. తమ బస్తీల్లో తాగునీటి, సీవరేజ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



విజయనగర్‌కాలనీ: పర్యావరణ పరిరక్షణకు పాఠశాల స్థాయినుంచే విద్యార్థులు నడుంబిగించాలని విద్యావేత్తలు గోపాల్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి సూచించారు. గురువారం ఆసిఫ్‌నగర్ నారాయణ పాఠశాలలో నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథులుగా హాజరై పాఠశాల పరిసరాలలో మొక్కలు నాటి ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ..రోజు రోజుకూ పెచుమీరుతున్న వాయు కాలుష్యాన్ని అరికట్టాలంటే ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని చెట్లుగా ఎదిగేంత వరకు పరిరక్షించాలన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్లకార్డులు చేతబట్టి పాఠశాల పరిసరాల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శశికళ, ప్రైమరి స్కూల్ కో ఆర్డినేటర్ కె.ఫర్హానా, ఈ కిడ్స్ కో ఆర్డినేటర్ రష్మిక, ఆర్ఐ నవీన్‌కుమార్, హైస్కూల్ స్టేట్ కో ఆర్డినేటర్ శ్రీలక్ష్మి, శ్రావణి, ఆబేదా పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల్లో చార్మినార్ జోన్ విజయం



ట్రోఫీ, సర్టిఫికెట్‌ను అందజేస్తున్న చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ వెంకన్న

చాంద్రాయణగుట్ట: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ స్పోర్ట్స్ టోర్నమెంట్ కబడ్డీ పోటీల్లో చార్మినార్ జోన్ విజయం సాధించింది. గత నెల 25 నుంచి 30వ తేదీ వరకు ఈ టోర్నమెంట్‌ను నిర్వహించగా 150 మంది జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్ల మధ్య వివిధ ఆటల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో కబడ్డీలో చార్మినార్ జోన్ విజేతగా నిలిచింది. దీంతో గురువారం జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ వెంకన్న విజేత జట్టుకు ట్రోఫీ, సర్టిఫికెట్‌ను అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గేమింగ్ ఇన్‌స్పెక్టర్ రవూఫ్, కబడ్డీ జట్టు కెప్టెన్ పి.ఇమానియల్, క్రీడాకారులు పాల్గొన్నారు.

నకిలీ రసీదు ఇచ్చిన డాక్యుమెంట్ రైటర్‌పై చర్యలు తీసుకోవాలి

అబిడ్స్: తన ప్లాటుకు సంబంధించి రిజిస్ట్రేషన్ చేయిస్తానని నకిలీ రసీదు ఇచ్చిన చిక్కడపల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఉన్న సిరి అసోసియేట్ డాక్యుమెంట్ రైటర్ పుట్ట హరిబాబుపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ హన్మంతుకు ఓ బాధితుడు విజ్ఞప్తి చేశారు. ఎంజేమార్కెట్‌లోని ఐజీ కార్యాలయంలో బాధితుడు బత్తుల బెనర్జి పూర్తి వివరాలతో కూడిన ఫిర్యాదును ఐజీకి అందించారు. ఈ సందర్భంగా బెనర్జి మాట్లాడుతూ..డాక్యుమెంట్ రైటర్ పుట్ట హరిబాబు రూ.5,24,300/-లక్షలు తాను ఇస్తే పోర్జరి రసీదు తనకు ఇచ్చారని వాపోడు. తాను రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లగా అది నకిలీ రసీదు అని తేలడంతో తాను తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యానన్నారు. వెంటనే నకిలీ రసీదు ఇచ్చిన హరిబాబును అడగగా అది సర్వర్ సమస్య అని తనకు వివరించారన్నారు. డబ్బులు మాత్రం ఇవ్వకపోవడంతో వెంటనే దోమలగూడ పోలీస్‌స్టేషన్‌లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశానన్నారు. పోలీసులు అతనిపై ఇంకా చర్యలు తీసుకోలేదన్నారు. నగర పోలీస్ కమిషనర్, రిజిస్ట్రేషన్ శాఖ ఐజీలు అతనిపై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని బత్తుల బెనర్జి విజ్ఞప్తి చేశారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



గన్‌ఫౌండ్రీ: ప్రముఖ నాట్య శిక్షణాలయం శ్రీవారి పాదాలు ఆధ్వర్యంలో నాట్య గురువు డాక్టర్ నల్ల రమాదేవి శిష్యులు గుండు శ్రీలక్ష్మి శ్రేష్ఠ, గుండు శ్రితల భరతనాట్య ఆరంగేట్రం గురువారం రవీంద్రభారతిలో కనుల పండువగా సాగింది. పుష్పాంజలి, అలరింపు, నటేష కౌవుత్వం, జతిస్వరం, అష్టలక్ష్మీ స్తోత్రం, శివతాండవం వంటి పలు అంశాలపై చక్కటి హావాభావాలతో సాగిన నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ..చదువులో ఎంత ఒత్తిడి ఉన్నా క్రమశిక్షణతో నాట్యంపైన శ్రద్ధ చూపడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్‌గిరి డీఆర్‌ఓ జేఎల్‌బీ హరిప్రియ, వాస్తు నిపుణులు వసంతం చంద్రమౌళి, తల్లిదండ్రులు శోభారాణి, మహాత్మారావు తదితరులు పాల్గొన్నారు.

సిటీ కాలేజీ, సెయింట్ పాల్స్ ఫార్మసీ కాలేజీ మధ్య ఎంఓయూ



ఒప్పంద పత్రాలను ప్రదర్శిస్తున్న కాలేజీల అధ్యాపక బృందం

చార్మినార్: సిటీ కాలేజీ, రంగారెడ్డిలోని సెయింట్ పాల్స్ ఫార్మసీ కాలేజీ గురువారం అవగాహన ఒప్పందం ఏర్పరచుకున్నాయి. ఈ ఒప్పందం విద్యార్థులకు నైపుణ్యాలు, అధ్యాపకులకు బోధన, పరిశోధనకు అవకాశం కల్పించటమే కాక, జ్ఞాన మార్పిడికి వేదికగా నిలుస్తుందని సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాల భాస్కర్ అన్నారు. ఇలాంటి ఒప్పందాల ద్వారా తమ జ్ఞాన వనరులను, ప్రయోగశాలలను ఉమ్మడిగా వినియోగించుకుంటే మరింత బలోపేతం అవుతాయని ఫార్మసీ కళాశాల చైర్మన్ కె.సుధీర్ అన్నారు. ఈ ఒప్పందం మూడేళ్ల పాటు అమలులో ఉంటుందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డా.విప్లవ్ దత్ శుక్లా, డా.కె.పర్వతాలు, డా.వాసుదేవరెడ్డి, డా.జ్యోతి, డా.రజిత, పి.రతన్ కుమార్, ప్రొ.చిన్ని కృష్ణ, ప్రొ.శ్రీనివాసరావు, విజయ నిర్మల, సుజహత్ పాల్గొన్నారు.

అందుబాటులోకి మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్



మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్‌తో కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి

గౌలిపురా: వర్షాకాలం నేపథ్యంలో గౌలిపురా డివిజన్ ప్రజలకు మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్ అందుబాటులోకి వచ్చిందని కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి అన్నారు. వర్షాకాలం సందర్భంగా మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్ డివిజన్ ప్రజలకు 24 గంటల పాటు అందుబాటులో ఉంటుందన్నారు. వర్షం పడినప్పుడు సజావుగా వరదనీరు సాగేందుకు ఈ టీమ్ తగిన చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్ మూడు నెలల పాటు ప్రజలకు సేవలను అందించనుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

గుత్తా సుఖేందర్‌రెడ్డికి ఆహ్వానం



గుత్తా సుఖేందర్‌రెడ్డికి ఆహ్వానం అందజేస్తున్న జనగామ మధుసూదన్‌గౌడ్

చార్మినార్: ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నామని ఉప్పుగూడా మహంకాళి ఆలయ కమిటీ చైర్మన్ జనగామ గౌడ్ తెలిపారు. ఈసారి జరిగే 76వ వార్షిక బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహిందానికి ఇప్పటికే తగిన ఏర్పాటు చేశామన్నారు. ఈసారి బోనాల ఉత్సవాలకు హాజరుకావాలని కోరుతూ ఇప్పటికే పలువురు అధికార, అనధికార ప్రముఖులకు ఆహ్వానాలు అందజేశామన్నారు. ఇందులో భాగంగా గురువారం తెలంగాణ రాష్ట్ర లెజిస్లేటివ్ కౌన్సిల్ చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని కలిసి బోనాల పండుగకు రావాలని ఆహ్వానించామన్నారు. ఈ మేరకు ఆలయం కమిటీ కార్యదర్శులు భవానీ శంకర్, ఆనంద్ లతో పాటు కమిటీ ప్రతినిధులతో కలిసి ఆయనకు ఆహ్వానపత్రం అందజేసి ఈనెల 20న జరిగే బోనాల జాతర ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరామన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ విద్యాబోధన



మాట్లాడుతున్న సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ చంద్రమౌళి

గోల్కొండ: ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ విద్యాబోధన ఉంటుందని సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ జి.చంద్రమౌళి అన్నారు. సెంట్రల్ పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం గోల్కొండ ప్రభుత్వ ప్రాథమిక బాలిక పాఠశాలలో విద్యార్థులకు జరిగిన నోటు పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు స్వచ్ఛంద సేవా సంస్థలతో పాటు పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు సైతం సహాయం అందించడానికి ముందుకు వస్తున్నారన్నారు. ఇటువంటి కార్యక్రమాలు సమాజ సేవకులకు, ఎన్‌జీవోలకు ఆదర్శంగా నిలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో టోలిచౌకీ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్, గోల్కొండ మండల డిప్యూటీ ఐవోఎస్ మహ్మద్ బషీరుద్దీన్, పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యులు ఆబేద్, ఇలియాస్ అలీ, మౌజమ్‌ఖాన్ తదితరులున్నారు.

కమ్యూనిటీ హాల్ పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

గౌలిపురా: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి అన్నారు. గౌలిపురా డివిజన్‌లోని భరత్‌నగర్‌బస్తీలో గురువారం కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను కార్పొరేటర్ భాగ్యలక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ...డివిజన్ ప్రజల సౌకర్యార్థం కమ్యూనిటీ హాల్ పనులను ప్రారంభించామన్నారు. డివిజన్ ప్రజలు ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రఘుకాంత్, రాజ్ కుమార్, జమాల్‌పూర్ అశోక్, కాల్‌దేవ్, సంతోష్, బస్తీవాసులు పాల్గొన్నారు.


బీబీకా అలవాను సందర్శించిన ప్రిన్స్ ఆజాం ఝా



బీబీకా ఆలంకు దట్టీలు సమర్పిస్తున్న ప్రిన్స్ ఆజాం ఝా

దబీర్‌పురా: ఇమామ్ హుస్సేన్ జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న మొహర్రం సంతాప దినాలలో భాగంగా అసఫ్ జాహీ రాజ వంశానికి చెందిన ప్రిన్స్ ఆజం ఝా బహదూర్ గురువారం సాయంత్రం బీబీకా అలవాను సందర్శించారు. షియా సివిల్ కౌన్సిల్ సభ్యులతో కలిసి బీబీ కా ఆలంలకు పూలు, దట్టీలు సమర్పించారు. దీంతో పాటు అషూర్ఖానా-ఎ-ఖదమ్-ఎ-రసూల్, పంజేషా ముబారక్, నాలే ముబారక్, బడేషాహి అషూర్ఖానా, బర్గా-ఎ-అబుల్ ఫజల్ అబ్బాస్, బారా ఇమామ్, సర్తూక్ కా అలవా, అజాఖానా అలావాలను సందర్శించి పూలు దట్టీలు సమర్పించారు. అజఖానా-ఈ-తో సహా అనేక పూజ్య స్థలాల్లో పుష్పాలు, దట్టీని సమర్పించారు. షెహజాదే ఖాసిం, ప్రిన్స్ అజంజాతో పాటు నవాబ్ మీర్ ఫిరోజ్ అలీ ఖాన్, నవాబ్ మీర్ మొహమ్మద్ అలీ ఖాన్, ప్రముఖ కౌన్సిల్ నాయకులు హిదాయత్ అలీ మీర్జా, మొహమ్మద్ అలీ హైదర్, షబ్బీర్ అలీ మీర్జా, అక్బర్ అలీ మీర్జా, సయ్యద్ అహ్మద్ హుస్సేని, సయ్యద్ మొహమ్మద్ సాదేక్ హుస్సేన్ పాల్గొన్నారు.

మట్టి కుండలకు భలే గిరాకీ



గోల్కొండ: మొహర్రంను పురస్కరించుకొని వివిధ ప్రాంతాల్లో మట్టికుండలు బాగా అమ్ముడవుతున్నాయి. మొహర్రం సంతాప దినాలను పురస్కరించుకొని వివిధ రకాల మట్టి కుండల్లో షర్బత్ తయారు చేస్తారు. అజ్రత్ ఇమామ్ హుస్సేన్ త్యాగానికి ప్రతీకగా మొహర్రం సంతాప దినాలను షియాముస్లింలు జరుపుకొంటారు. దీన్ని పురస్కరించుకొని షర్బత్ వితరణ చేస్తారు. ఈ షర్బత్‌ను ప్రత్యేకంగా మట్టి కుండలలోనే తయారు చేస్తారు. ఆసిఫ్‌నగర్, అహ్మద్‌నగర్, గోల్కొండ తదితర ప్రాంతాల్లో కుమ్మరులు ప్రత్యేకంగా తయారు చేసిన వివిధ సైజుల కుండలు బాగా అమ్ముడవుతున్నాయి.